


నేడు జిల్లాలో మంత్రి కాకాని పర్యటన

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు గుంటూరు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.30 గంటలకు రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుంటారు. 10.45 గంటల నుంచి 11.15 వరకు నగరంలోని శ్యామల థియేటర్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న డిసిసిబి బ్రాంచ్ భవనానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 12.30 గంటలకు లాల చెరువు వద్ద నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ప్రారంభిస్తారు. తరువాత కాతేరు బయలుదేరి వెళ్తారు. 2.30 గంటల వరకు కాతేరు సిటిఆర్‌ఐ పరిధిలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ శాఖ కళాశాల భవనాల సముదాయాలను ప్రారంభిస్తారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా అలంపురం వెళ్తారు.

'జగనన్నకు చెబుదాం'తో మరింత బాధ్యత

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారం చేసే విధానంలో అధికారులపై మరింత బాధ్యత పెరిగిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి 'జగనన్న కే చెబుదాం' ఆన్‌లైన్ కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తాడేపల్లిలోని సిఎం విడిది కార్యాలయం నుంచి జగనన్న కే చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు జెకెసి కార్యక్రమంతో మరింత బాధ్యతతో పాటుగా జవాబుదారీ తనం కూడా పెరిగిందన్నారు. జిల్లా స్థాయిలో కాకుండా గ్రామ స్థాయి వరకు ప్రజల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయడం ముఖ్యమన్నారు. ఈ మేరకు జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో మానిటరింగ్ యూనిట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిహెచ్.సుధీర్‌కుమార్‌రెడ్డి, జెసి ఎన్.తేజ్‌భరత్, రూడా చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, డిఆర్ఓ జి.నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు



నిరసన తెలుపుతున్న పోస్టల్ సిబ్బంది

తపాలా ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దు అన్యాయం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

తపాలా శాఖ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య(ఎన్ఎఫ్‌పిఇ), అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం(ఎఐపిఇయు) గుర్తింపు రద్దు చేయడం అన్యాయమని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాజమండ్రి డివిజన్ కార్యదర్శి బి.కొండబాబు అన్నారు. ఈ చర్యను నిరసిస్తూ రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కేంద్రం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం తెచ్చిన నూతన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఆర్థిక సాయం చేశారనే కారణంగా రెండు యూనియన్ల గుర్తింపును రద్దు చేయడం దారుణమన్నారు. 70శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ రెండు యూనియన్ల గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా రాజమండ్రి ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న ఒక గుర్తింపు లేని ఉద్యోగ సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో వివిధ ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు తపాలా యూనియన్లకు మద్దతు ప్రకటించాయన్నారు. గుర్తింపు పునరుద్ధరించే వరకు పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ ప్రెసిడెంట్ యుజి.ప్రకాష్, తపాలా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామలింగేశ్వరరావు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, పెన్షనర్స్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైసిపి నేత బూరాడ హత్య

పోలీసుల అదుపులో నిందితుడు

పాత కక్షలే కారణంగా ప్రాథమిక నిర్ధారణ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం



మాజీ కార్పొరేటర్, 44వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి బూరాడ కృష్ణకుమారి భర్త భవాని శంకర్(58) తన ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం భవానీశంకర్ అతని భార్య కృష్ణకుమారితో కలిసి ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటికి వచ్చారు. భోజనం కోసం ఇరువురూ హాల్లో కూర్చొన్నారు. అప్పటికే వారిని పీత అజయ్ బైకుపై వెంబడిస్తూ వచ్చాడు. మాట్లాడాలని భవానిశంకర్‌ను బయటకు పిలిచాడు. ఈ సమయంలో అజయ్ వెనుక కత్తి ఉండటాన్ని భార్య కృష్ణకుమారి గమనించింది. వెంటనే భర్తను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నించింది. ఈలోగానే అజయ్ కత్తితో భవానిశంకర్‌ను పొడిచి బైకుపై పరారయ్యాడు. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యారు. తీవ్రంగా గాయపడిన భవానిశంకర్‌ను వెంటనే నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిసి ఫుటేజీల ఆధారంగా నిందితుని గుర్తించారు. గాలింపు చేపట్టి నిందితుడు పీత అజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు పాత కక్షలే కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. భవానిశంకర్ మృతితో వార్డులో విషాదం నెలకొంది.

బాధిత కుంటుంబానికి ఎంపీ భరత్ పరామర్శ

బూరాడ భవానిశంకర్ హత్య వార్త తెలియగానే ఢిల్లీలో ఉన్న ఎంపీ భరత్ కష్ణకుమారిని ఫోన్లో పరామర్శించారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఎస్‌పితో మాట్లాడానని, ఈ ఘటన వెనుక ఎవరున్నా వదిలేది లేదని తెలిపారు. భవానిశంకర్ తనకు అత్యంత ఆప్తుడని తెలిపారు. మృతుని కుటుంబానికి పార్టీ అంతా అండగా ఉంటుందన్నారు. విషయం తెలియగానే వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిస భవానీప్రియ, నక్కా నగేష్, పోలు విజయలక్ష్మి, ఎన్‌వి.శ్రీనివాస్, శీతనబోయిన సాయిరామ్, కాంతారాం పాటిల్, గణేష్, కృష్ణవేణి తదితరులు బోరాడ భవానీ శంకర్ ఇంటికి చేరకున్నారు.



ఎంపీ భరత్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న కృష్ణకుమారి

పిడింగొయ్యిలో ఎస్‌సి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో ఎస్‌సి కమిషన్ చైర్మన మారుమూడి విక్టర్ ప్రసాద్ మంగళవారం పర్యటించారు. మంగళవారం స్థానిక కోరుకొండ రోడ్డులోని ప్రయివేటు గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడింగొయ్యిలో ఎస్‌సిలకు చెందిన భూ సమస్యపై పలుమార్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చామన్నారు. భూ పత్రాలు, కోర్టు ఆర్డర్స్, భూమి స్థితి గతులను పరిశీలించామన్నారు. పిడింగొయ్యిలో ఆర్‌ఎస్ నంబర్ 511 / 1సిలో 10.66 ఎకరాలుంటే అందులో 4 ఎకరాల ఒక ఎస్‌సి కుటుంబానికి ఇచ్చారన్నారు. ఒక ఎకరం 60 సెంట్లు శ్మశాన వాటికకు ఉంచారన్నారు. మిగిలిన భూమిని దళితులకు కేటాయించినట్టు రికార్డుల ద్వారా తెలిసిందన్నారు. ఈ భూమిని ఎస్‌సిల ప్రయోజనం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. ఇందు కోసం కమిషన్ కృషి చేస్తుందన్నారు.

మళ్లీ తెరపైకి ఫ్లెక్సీ వివాదం

ప్రజాశక్తి – తాళ్లపూడి

రావూరుపాడు రహదారి విషయంపై ఎంపిటిసి సభ్యులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదం మంగళవారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఎంపిటిసిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించడం చర్చ నీయాంశమైంది. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గం నాయకులు కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ టివి.రామారావు, గాయత్రి వెంకటేశ్వరరావు తదితరులు తాళ్లపూడికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున పోలీసు సిబ్బందిని మొహరింపజేశారు. జనసేన నాయకులు రామారావు, వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ, హరిబాబు కొవ్వూరు సిఐ రమణ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. జరిగిన విషయంపై నోటీసు ఇవ్వడానికే పిలిచామని పోలీసులు తెలిపారు. ప్రజా సమస్యలు తీర్చాలని అడగడం తప్పా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని కోరితే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎలాంటి కేసు పెట్టలేదని పోలీసులు స్పష్టం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

రెచ్చగొట్టడం సరికాదు : రామారావు

జనసేన పార్టీని అనగదొక్కాలని చూస్తూ కులాల మధ్య చిచ్చు పెట్టి రెచ్చగొట్టడం సరికాదని జనసేన నాయకులు, కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ టివి.రామారావు అన్నారు. తాళ్లపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమస్యలపై నిలదీసే ప్రజాప్రతినిధులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.



న్యాయమూర్తి జాన్సన్‌ను కలిసిన స్నేహితులు

ప్రజాశక్తి – నిడదవోలు

సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జిల్లా జడ్జి, నిడదవోలు వాస్తవ్యులు మత్తి జాన్సన్‌ను ఆయన చిన్ననాటి స్నేహితులు కలిశారు. ఆయన మంగళవారం నిడదవోలు వచ్చారు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు, న్యాయవాదులు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశానికి న్యాయవాది జువ్వల రాంబాబు అధ్యక్షత వహించారు. న్యాయమూర్తి జాన్సన్ మాట్లాడుతూ న్యాయవాదులు వృత్తికి గౌరవం పెంచాలన్నారు. వివిధ పుస్తకాల్లో వచ్చే తీర్పులను చదివి వృత్తిలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. నిడదవోలు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.అర్జునుడు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదుల సలహాలను పాటించి వృత్తికి న్యాయం చేయాలని కోరారు అనంతరం నిడదవోలు బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు న్యాయమూర్తి జాన్సన్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రసాద్, పి.సూర్యనారాయణ, ఎస్.కాశీవిశ్వేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, విజయకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, సాగర్, పేరూరి సాయిబాబా పాల్గొన్నారు.

పెద్దకొడుకుగా సిఎం జగన్ బాధ్యత

హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

ప్రతి కుటుంబంలో పెద్ద కొడుకు బాధ్యతను సిఎం జగన్ తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు ఆర్థిక సాయాన్ని మంగళవారం ఆమె లబ్ధిదారులకు అందించారు. కొవ్వూరు నియోజకవర్గంలో కళ్యాణమస్తు రెండో విడత ప్రొత్సాహకంగా 68 మంది లబ్ధిదారులకు రూ.57లక్షల 20 వేల చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం వెనుక ఎంతో దూరదృష్టి, ప్రజల భవిష్యత్ అవసరాలను గుర్తించి ప్రవేశపెడుతున్నారన్నారు. ఇందులో భాగంగా పేదింట్లో ఆడపిల్ల పెళ్లి కుటుంబానికి భారం కాకూడదన్న తపనతో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాలను ప్రారంభించారని తెలిపారు. 'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు..' అనేది పెద్దల నానుడి అని, ఈ రెండింటిని ముఖ్యమంత్రి జగన్ చేసి చూపారన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడానికి, స్కూళ్లలో డ్రాపౌట్స్ తగ్గించి బాలికా విద్యను ప్రొత్సహించడానికి వరుడు, వధువులు ఇద్దరూ పదో తరగతి తప్పనిసరి అనే నిబంధన పెట్టామని తెలిపారు. ఉచితాలతో ప్రజలను సోమరిపోతులను చేస్తూన్నారంటూ ప్రతిపక్ష వ్యాఖ్యలను ఖండించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరోనా సమయంలోనూ సంక్షేమాన్ని అందించామన్నారు. కరోనా, బ్లాక్ ఫంగస్ వంటి వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి వైద్యం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..



చెక్కు అందిస్తున్న మంత్రి తానేటి వనిత

వరికుచ్చుల మహాలక్ష్మి ఇకలేరు

ప్రజాశక్తి– కడియం



మహాలక్ష్మి(ఫైల్ ఫొటో)

దాదాపు ఐదు దశాబ్దాలుగా వరి కుచ్చులు అల్లుతూ, వాటిని ఆలయాల్లో, విశాల జాగాలో చెట్లకు కడుతూ పక్షులకు ప్రాణప్రదాతగా నిలిచిన పెనుమాక మహాలక్ష్మి(73) మంగళవారం కన్నుమూశారు. ఆయన జీవిత చరిత్రను తెలంగాణా పాఠ్యపుస్తకాల్లో ఒక పాఠ్యాంశంగా కూడా పొందుపర్చారు. కడియానికి చెందిన పెనుమాక మహాలక్ష్మి భార్య పదేళ్ల క్రితమే కాలం చేశారు. ఆయనకి వివాహితులైన ఇద్దరి కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరందరూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కళ్లాలకు వెళ్లి వరి పనలు అడిగి తెచ్చుకొని వాటిని తన ఇంటి సమీపంలో ఉన్న రామాలయంలో ఉంచి వాటిని వరికుచ్చులుగా మహాలక్ష్మి అల్లుతుండేవారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా అల్లిన వరి కంకులను దేవాలయాలు, చెట్లకు కడుతూ ఉండేవాడు. వరి కంకులు కట్టడంలో బహు నేర్పరైన మహాలక్ష్మికి పక్షులంటే ఎంతో మక్కువ. తాను కట్టిన వరి కంకులను పక్షులు తింటూ ఉంటే చూసి మురిసిపోయేవాడు. 'పని పాటు లేకుండా పక్షుల కోసం కాలక్షేపం చేస్తే ఎలా?' అని ఎవరైనా ఎద్దేవా చేస్తే 'వాటికి మనం కాకపోతే ఎవరు పెడతారు బాబయా" అంటూ సమాధానమిచ్చేవాడు. ఎవరన్నా వరిపన ఇచ్చి కుచ్చులు కట్టమంటే కట్టిపెట్టేవాడు. వాళ్లు మెచ్చి పదో పరకో ఇస్తే తీసుకునేవాడు. మహాలక్ష్మి చేస్తున్న మూగజీవుల సేవలు గురించి అనేకసార్లు ఉభయ తెలుగు రాష్ట్రాల పత్రికల్లో ప్రచురితమయ్యాయి. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస , తదితరులు మహాలక్ష్మి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి – గోపాలపురం

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని చిట్యాల హెచ్‌ఎం ఐ.కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాల పరిధిలో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థుల చదువుకు అవసరమైె మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు, అమ్మ ఒడి, రాగిజావ వంటి వాటిని అందిస్తుందన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి పలువురు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు రిజిస్టర్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానుబాబు, చిన్నదోశయ్య, అంగన్‌వాడీలు, ఎంపిటిసి సభ్యులు, పిఎంసి చైర్మన్, సిఆర్‌పి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ఉచిత ఫౌండేషన్ కోర్స్

ఉండ్రాజవరం : ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉచిత ఫౌండేషన్ కోర్సును నిర్వహిస్తున్నట్టు బౌద్ధ దమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో తెలిపారు. 25 రోజులుగా పాలీసెట్ ఉచిత కోచింగ్ క్యాంపు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన విద్యార్థులు చక్కగా పరీక్ష రాసి పాలిటెక్నిక్ సీట్లు సంపాదించాలన్నారు. గురువారం నుంచి ఉచిత ఫౌండేషన్ కోర్సు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గణితం, ఆంగ్లంలో ప్రాథమిక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. వివరాలకు 9440041012 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడియాల సూర్యనారాయణ, మల్లిన రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, బూరుగుపల్లి కళారావు, ఆళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు నిశా హాస్పిటల్ వైద్యులు అయేషా ఖాన్ వైద్యసేవలు అందించారు. పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్ మాట్లాడారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి హై రిస్క్ వారిని గుర్తించి వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నామన్నారు. డాక్టర్ ఉషాదేవి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రవసం పోసుకున్న వారికి జననీ సురక్ష యోజన పథకం కింద రూ.వేయి పోషకాహారం నిమిత్తం లబ్ధిదారుల ఖాతాకు జమేస్తారన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, పర్యవేక్షకులు జె.శ్రీనివాసు, సుభాషిణి, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి – యంత్రాంగం

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆటపాటలతో పాటు విజ్ఞాన సంబంధిత అంశాలపై చిన్నారులకు నిపుణులు శిక్షణ ఇస్తున్నారు. **చాగల్లు** శాఖా గ్రంథాలయంలో మంగళవారం రిసోర్స్‌పర్సన్ తెలుగు వ్యాకరణాన్ని బోధించారు. 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు డిక్టేషన్ నిర్వహించామని గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు తెలిపారు. **రాజమహేంద్రవరం** సీతంపేట గ్రంథాలయంలో పి.కృష్ణమోహన్ వేదిక్ మాథ్స్‌పై అవగాహన కల్పించారు. ఎ.కృష్ణశర్మ పిల్లలకు పంచతంత్ర కథలు చెప్పారు. గణిత ఉపాధ్యాయులు సతీష్ కుమార్ గణిత సూత్రాలు, సమస్యల పరిష్కారాలపై అవగాహన కల్పించారు. ఇంగ్లీష్ గ్రామర్‌ను చార్టుల ద్వారా పిల్లలకు వివరించారు. పి.రాంబాబు తెలుగు పద్యాలు నేర్పించారు. వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ సిబ్బంది ఎం.వీరలింగం, డి.రాజు, పాఠకులు పాల్గొన్నారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి స్నాక్స్, పెన్నులు, నోట్ పుస్తకాలు అందించారు.

కార్టూ'నిజం'



మీరీ విషయాన్ని అసంతృప్తులతోనే... చెబితే ఎలా సార్..!!!

మణిపూర్ నుంచి క్షేమంగా చేరిన విద్యార్థిని

ప్రజాశక్తి– కడియం



తల్లిదండ్రులతో సాయిశ్రీ

మణిపూర్‌లో ఎన్‌ఐటి చదువుతున్న కడియం మండలం వేమగిరికి చెందిన మద్దెల యశస్వినిసాయిశ్రీ మంగళవారం క్షేమంగా ఇంటికి చేరింది. ఆమె ఎన్‌ఐటిలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కుమార్తె ఎలా ఉందో తెలీక తల్లిదండ్రులు వెంకటరామకృష్ణ, శోభారాణి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యేక విమానాల ద్వారా అక్కడ విద్యార్థులను హైదరాబాదు తీసుకొచ్చారు. అక్కడినుంచి బస్సులో ఆయా ప్రాంతాలకు తరలించారు. సాయిశ్రీ క్షేమంగా చేరుకోవడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

మండలంలో పలుచోట్ల ఎస్‌ఇబి దాడులు

ప్రజాశక్తి – గోపాలపురం

మండలంలో పలు చోట్ల ఎస్‌ఇబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారని ఎక్సైజ్ సిఐ సుధ తెలిపారు. మండలంలోని నందిగూడెంలో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గోపాలపురంలోని మునేశ్వరరావు అనే కిరణా వ్యాపారి షాపును తనిఖీ చేశారు. బెల్లం కొనుగోలు చేసినట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. సార తయారుదారులు, విక్రేతలపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

రైతులను ఆదుకోవాలని టిడిపి నిరసన

ప్రజాశక్తి – యంత్రాంగం

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద మంగళవారం నిరసనలు జరిగాయి. అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. **గోకవరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడప భరత్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉంగరాల రాము, వైసిపి మండల అధ్యక్షుడు చింతల రామకృష్ణ తదితరులు మాట్లాడారు. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట పాడైపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంట నీటిలో తడిసిపోవడంతో తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. అయినా వైసిపి ప్రభుత్వం నిమ్మకు నిరీత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న, రంగు మారిన ధాన్యాన్ని, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం అందించాలన్నారు. మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పిడుగు పాటుకు గురై మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నరు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. నష్టపోయిన రైతులను ఆదుకుని, వారికి పరిహారం చెల్లించాలని నినదించారు. అనంతరం తహశీల్దార్ జి.కనకరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ మాట్లాడారు. పది రోజులుగా కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట చేజారిందన్నారు. చేలో నీరు నిలవడంతో ధాన్యాన్ని రోడ్డుపైకి తరలించేందుకు భారీగా ఖర్చుచేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. **పెరవలి** తహశీల్దార్ కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. తెలుగు రైతు మండల అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ టి.రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అతికాల వెంకటరామకృష్ణమ్మ, ఎంపిటిసి సభ్యులు రాపాక ప్రమీల, టిడిపి రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు మంగం రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు హనుమంతు సుబ్రహ్మణ్యం సలాది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

ఆక్రమణ తొలగింపు నిరసిస్తూ

మరో యువకుని ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మాస్టర్ డ్రైన్ నిర్మాణ నిమిత్తం అధికారులు ఆక్రమణలు తొలగింపు శ్రీకారం చుట్టారు. ఆక్రమణల తొలగింపు వలన తమ దుకాణాలు పోతున్నాయని గత నెల 5న శిరగం శ్రీనివాసరావు అనే వ్యక్తి సెల్ టవర్ ఎక్కి 6 గంటల పాటు హల్చల్ చేశాడు. ఈ నేపథ్యంలో అధికారులు మరల సోమవారం బాలాజీ చౌక్ సెంటర్లో దుకాణాలు తొలగించవలసిందిగా యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో స్థానిక బాలాజీచౌక్ కార్నర్లో గల దుకాణం యజమాని దత్తి శ్రీ నూకరాజు అనే యువకుడు మంగళవారం విష పదార్థం సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ప్రతిపాడు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ సందర్భంగా యువకుడు విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో అనేక ఆరోపణలు చేశాడు. బాధితుడు నగర పంచాయతీ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. రాజకీయ నాయకులు తమ బంధువుల వద్ద బాధితుడు నగర పంచాయతీ అధికారులు ఆశిశాలు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడని, అతనిని ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరించారని ఆరోపించారు. ఒకవైపు దుకాణాలు పోయి, మరోవైపు ఉద్యోగం కూడా పోతే తన కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలని ఆత్మ హత్యయత్నానికి పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో తెలిపాడు. ఆక్రమణ తొలగింపు నిలుపుదల చేయాలని బాధి తుడు కోరాడు. ప్రస్తుతం యువకుడు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సి ఉంది.

గోదావరిలో దూకి యువకుని ఆత్మహత్యాయత్నం

- కాపాడిన మత్స్యకారులు

ప్రజాశక్తి - యానాం

యానాం ఎదుర్లంక బాలయోగి వారధి నుంచి గోదావరిలో దూకి సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుండగా చూసిన స్థానిక మత్స్యకారులు, పోలీసులు అతనిని రక్షించారు. విజయవాడకు చెందిన ఇంజినీరింగ్ చదివిన ఇందుకుర్తి శ్రీకాంత్ కుటుంబసమస్యలు, ఆర్థికపరమైన సమస్యలతో కలతచెంది బాలయోగి వారధి రెండవ పిల్లర్ భాగం నుంచి గోదావరిలోకి దూకాడని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న రాజీవ్బీచ్ ప్రాంతంలో బోట్లు రిపేరు చేసుకుంటున్న పెమ్మాడి భైరవస్వామి మరో ఇద్దరు కలిసి ఈదుకుంటూ వెళ్లి ఇందుకుర్తి శ్రీకాంత్ను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. స్థానిక టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది, బీట్ పోలీసు సిబ్బంది వచ్చి అపస్మారకస్థితిలో ఉన్న శ్రీకాంత్కు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం తన కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలను తెలిపారు. అక్కడ నుంచి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడ జిజిహెచ్కు తరలించారు. శ్రీకాంత్ ఆరోగ్యపరిస్థితి మెరుగైందని ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఇందుకూరి శ్రీకాంత్ పై ఈ నెల 8న అదృశ్యం కేసు నమోదయిందని ఎస్ఐ శేరు నూక రాజు తెలిపారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని క్రాప గ్రామంలో 900 గ్రాముల గంజాయిని ముగ్గురు యువకులు విక్రయిస్తుండగా పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇవి.. అయినవిల్లి మండలం క్రాప గ్రామ శ్మశానవాటిక వద్ద గంజాయి అమ్మకాలు జరుపుతున్నాయని పోలీసులకు సమాచారం అందడంతో దాడిచేసి తునికి చెందిన కర్రి సత్తిబాబు, కాకినాడకు చెందిన జగన్నాథం రాజేష్, ఫ్రెంచ్ యానాంకు చెందిన బల్లా వెంకట శివాజీలకు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 900 గ్రాముల గంజాయితో పాటు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్యపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం చిన్న పేటలో ఒక మహిళ హత్య గురైన సంఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు గ్రామానికి చెందిన నక్క మహాలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. ఆమె కుమారుని వద్ద ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం ఆమె కుమారుడు గదిలో నిద్రిస్తున్నాడు. తల్లి మహాలక్ష్మి బయటికి వెళ్లిందని అనుకున్నాడు. కానీ పక్క గదిలో తల్లి విగత జీవిగా మంచంపై పడి ఉండడం చూశాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సిఐ రజిని కుమార్, ఎస్ఐ సిహెచ్.సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహాలక్ష్మి హత్యకు గురైనట్లుగా నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు

హత్యకేసు నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - పెరవలి

నడిపల్లికోటకు చెందిన కొడమంచి సురేంద్ర(25) హత్య కేసులో ప్రధాన నిందితుడు లక్కవరపు పవన్కళ్యాణ్ను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారని సిఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పవన్కళ్యాణ్కు సురేంద్ర కొత్త మొబైల్ను ఇఎంఐపై ఇప్పించాడు. రెండు వాయిదాలు పవన్కళ్యాణ్ సక్రమంగానే కట్టాడు. అనంతరం వాయిదాలు కట్టడం మానేశాడు. దీంతో వాయిదాలు కట్టాలని అడిగేందకు సురేంద్ర వెళ్లాడు. ఆగ్రహానికి గురైన పవన్కళ్యాణ్ ఇనుప గొట్టంతో సురేంద్రను కొట్టి చంపేశాడు. ఇంట్లోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచ్చారు.

విరిగిన స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బైక్ అతి వేగంగా నడుపుతూ విరిగిన కరెంట్ స్తంభాన్ని ఢీ కొని యువకుడు మృతి ఈ సంఘటన వాడపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇవి.. గ్రామానికి చెందిన పోలిమాటి మహేష్ కుమార్ మంగళవారం బైక్ అతి వేగంగా నడుపుతూ రోడ్డు పక్కన గ్రామస్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసుకున్న విరిగిన కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని కుటుంబ సభ్యులు 108 లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ కేసు తెలిపారు.

యానాం వార్తలు


కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్

ఇద్దరు కార్మికులను బంధించి చిత్రహింసలు

- యాజమాన్యంపై చర్యలు కోరుతూ సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పని నచ్చక వెళ్లిపోతున్న ఇద్దరు కార్మికులను యాజమాన్యం బంధించి, చిత్రహింసలకు గురిచేసిన సంఘటన యానాంలో వెలుగుచూసింది. స్థానిక సీతారామనగర్ అడవిపొలంలో ఉన్న సీజన్స్ హెల్త్ కేర్ లిమిటెడ్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన మురుగు, మరో వ్యక్తిని సెక్యూరిటీ గదిలో భోజనం కూడా పెట్టకుండా పది రోజులపాటు బంధించి చిత్రహింస లకు గురి చేసినట్టు బాధితుడు మురుగు, స్థానికులు తెలిపారు. బాధితులకు పది రోజులపాటు స్థానికుడు చిల్లా శ్రీను అనే వ్యక్తి భోజనం పెట్టినట్లు తెలి పాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరు బాధితులు తప్పించు కోవడానికి ప్రయత్నించగా మురుగు అనే వ్యక్తిపై సెక్యూరిటీ సత్యనారాయణ, క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సయ్యద్ అహ్మద్లు దాడి చేస్తున్న సమయంలో స్థానికులు అడ్డుకుని మురుగుని కాపాడారు. మరో వ్యక్తి ఎక్కడికి వెళ్లిపోయాడో తెలియదని తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు, కార్మికులకు అండగా నిలిచారు. బాధితులను చిత్ర హింసలకు గురిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ కార్మికులకు అండగా సిఐటియు పోరాడు తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెల్లం చిన్న, సబ్బతి శ్రీనివాసరావు, మెల్లం నూకాంబరం, కామిరెడ్డి వీరబాబు, యనమదల పెద్దిరాజు, మోర్తా యేసు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్లు 24 గంటలు పని చేయాలి

యానాం ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకుల డీలర్లతో ఆర్ఎఒ మునిస్వామి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. బంకులు 24 గంటలు పని చేయాలని, ప్రతి బంకులో పబ్లిక్ టాయిలెట్లు ఉండాలని సూచించారు. 2వేల500 లీటర్ల కంటే ఎక్కువ రవాణా చేసినట్లయితే పౌరసరఫరాల శాఖ నుండి అనుమతి పొందాలని ఆర్ఎఒ వివరించారు. ముందుగా ద్విచక్ర వాహనాదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

మెట్టకూరులో ఆర్ఎఒ పర్యటన

మెట్టకూరు రాజబాబు కాలనీలో రోడ్లు,డ్రైన్లు లేక వర్షపు నీరు నిల్వ ఉండిపోతుందని దాని ద్వారా దోమలి పెరిగి వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ కలిసి గ్రామాన్ని సందర్శిం చారు.

11న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

యానాంలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి, ఫిర్యాదుల స్వీకరణకు గురువారం పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఎఇ లంక కృష్ణారావు తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. పుదుచ్చేరి విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు సెంథిల్ కుమార్ పర్యవేక్షణలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


బాధితునితో వైద్యులు

తుని ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - తుని

తుని ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అరుదైన శస్త్రయికిత్స చేసి రెండు కేజీల కణితిని తొలగించారు. తొండంగి మండలం గురువారం కొత్తపేట గ్రామానికి చెందిన 50 ఏళ్ల .మాసేను ఎడమ కాలు వద్ద కణితితో ఇబ్బంది పడుతూ సోమవారం తుని ఏరియా ఆసుపత్రికి రాగా పరీక్షలు నిర్వహిం చారు. వైద్యులు సాయికిరణ్, నరేష్, శ్రావణి బందం సుమారు మూడు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి రెండు కేజీల కణితిని బయటకు తీశారు. ఈ సందర్భంగా తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పోతల లక్ష్మణ్, చిక్కాల లక్ష్మణ్ సూపరింటెండెట్ స్వప్న,, వైద్యులను అభినందించారు.

షార్ట్ సర్క్యూట్తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - తుని

కోటనందూరులో మంగళవారం షార్ట్ సర్క్యూట్ వల్ల తాటాకిల్లు దగ్ధమైంది. దళిత కాలనీకి చెందిన నందికి విజయరాజు తాటాకు ఇంట్లో నివాసం ఉంటుం డగా కరెంటు వైరు తాటాకు ఇంటికి తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి సుమారు నాలుగు లక్షల విలువైన సామగ్రి కాలిపోయిందని వారు తెలిపారు. సర్పంచ్ గరిసింగి శివలక్ష్మి, వైసిపి నాయకులు దొర బాబు, రాము, శ్రీనివాస్, శ్రీను వారిని పరామర్శించారు.

తడిసిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గంలో తెలుగు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులను కలిసి కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం వడ్లమూరులో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఎలిశెట్టి నాని మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఉపేంద్ర, బోసు, కందుల విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంజర్లో గడప గడపకూ..

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ఇంజరం పంచాయతీలో సర్పంచ్ ముద్దన వెంకట శివ రాంప్రసాద్ ఆధ్వర్యంలో అరటి కాయలంక, బుడితివారి పేటలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చింతలపాటి శ్రీనివాసరాజు, ఎంపిపి రాయుడు సునీత , జడ్పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివ నారాయణ, సర్పంచ్ ముద్దన ప్రసాద్, పాల్గొన్నారు.

ముగిసిన యూత్ ఐ.కాన్ స్పోర్ట్స్-2023

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు యూత్ ఐ.కాన్-2023 పేరిట నిర్వహించిన వివిధ రకాల క్రీడలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు కళాశాల ప్రిన్సి పాల్ ఆదిరెడ్డి రమేష్ ట్రోఫీ, మెడల్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎన్.రవి,. డీన్ పి.ఎస్.వి.వి.ఎస్ రవి కుమార్, ఎఒ టి.ఎన్.వి.ఎస్. రామచంద్రన్, క్రీడాకా రులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతూ సుధారాణి బాలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తుని

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని పట్టణ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఏలూరు సుధారాణి బాలు అన్నారు. మంగళవారం మన మున్సిపాలిటీ - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 22వ వార్డులో పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయో లేదో అని నేరుగా వారితో ముఖాముఖిగా మాట్లాడి ప్రభుత్వం యొక్క పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం సుధారాణి బాలు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో తుని పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ పామర్తి మహేష్, అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, బోదపాటి శ్రీను, కౌన్సిలర్లు జీవరత్నం, కోలా శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంతో సమగ్రంగా సర్వే చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు,సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.


రోడ్డు మధ్యలో గోతిని పూడ్పిస్తున్న యువత

డ్రెయినేజీ నిర్మాణానికి తవ్విన గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి - గండేపల్లి

ఇటీవల గండేపల్లిలో సింగరంపాలెం వెళ్లే రహదారిలో బీసీ కాలనీకి చెందిన డ్రెయినేజీ వాటర్ ను తరలిం చేందుకు దళితువాడవైపు డ్రెయినేజీ నిర్మాణానికి గోతులు తీస్తుండగా దళితవాసులు ఆందోళన చేప ట్టారు. దానివల్ల ట్రాఫిక్ సమస్య నెలకొంది. జనతా గ్యారేజ్ యువకులు విప్పర్ల సురేష్, దారా కాటయ్య, వెంపాటి సతీష్, పసుమర్తి సుబ్ర మణ్యం తదితరులు సొంత ఖర్చులతో యధావిధిగా రోడ్డు మధ్యలో తీసిన డ్రెయినేజీ గోతిని పూడ్చి వేయించారు. దీంతో ఆ దారిలో వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా ఉండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు

ఆక్రమణదారులకు మున్సిపాలిటీ నోటీసులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వెనుక గల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి మున్సిపల్, రెవెన్యూ అధికా రులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల కాలంలో తహశీల్దార్ కాలనీ వెనుక లక్షలాది రూపా యల విలువ జేసే ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల జోక్యంతో ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. దానిపై పలువురు చేసిన ఫిర్యాదులు మేరకు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు వాటిని ఆక్రమణదారులు స్వచ్ఛం దంగా తొలగించు కావాలని లేదంటే తామే తొలగించే చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరిస్తూ కట్టడాలకు అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులకు కొద్ది రోజులు గడువును ఇస్తూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లేని పక్షంలో తామే శాఖపరంగా ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు.

పుస్తక పఠనంతో సామాజిక అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుండి పుస్తకాలు చదవటం వల్ల సామాజిక అవగాహన పెరుగుతుందని హిందీ పండిట్ వాడపల్లి విమలా రాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం రెండవ రోజు మంగళవారం ఆమె కథలు చదవటం, కథలు చెప్పడం,స్పోకెన్ ఇంగ్లీష్ లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు,సిబ్బంది సింగం బుల్లయ్య,మరియమ్మ,పాఠకులు పాల్గొన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలో ని యాస లపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు పూజిత టీచర్ ఉదయం విద్యార్థులకు ఆత్మ రక్షణకు సంబంధించిన అనేక అంశాలపై కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఎంఎస్సి మూర్తి మ్యాథ్స్లో, శ్యామ్ కుమార్ డ్రాయింగ్లో శిక్షణ ఇచ్చారు. ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు జోత్స్న, అమత, సూరజ్లు మ్యాథ్స్లో శిక్షణ ఇచ్చారు.ఎంఎస్సి మూర్తి, అధ్యాపకులు రాజకుమార్, లక్ష్మిలు చాక్లెట్స్,బిస్కెట్స్ అందజేశారు.

ఓటమి విజయానికి తొలి మెట్టు

ప్రజాశక్తి - గండేపల్లి

ఓటమి అంటే తుది మెట్టు కాదని మన కృషి పట్టుదలతో విజయానికి తొలిమెట్టుగా మలుచుకొని ముందుకు సాగాలని వక్తలు విద్యార్థులకు పిలుపు నిచ్చారు. సూరంపాలెంలో ఆదిత్య సెంట్రల్ లైబ్రరీలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ కె. అశోక్ కుమార్, జాయింట్ ట్రెజరర్ తోటకూర గంగాధర్లు విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. టెన్త్, ఇంటర్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ముగిసి పోయింది అనుకోవడం మూర్ఖత్వం అన్నారు. తొందరపాటు చర్యలతో ఆత్మహత్యకు పాల్పడటం మానుకోవాలని, తమను తాము తెలుసుకున్న వారు ఆయా రంగాలలో ప్రావీణ్యం పెంపొందించుకొని పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి అత్యున్నత స్థాయిలో ఉన్నవారు ఎందరో ఉన్నారని వివరించారు.

రైల్వే స్టేషన్లో అన్నవరం దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్లో అన్నవరం ఆలయానికి చెంది సామర్లకోట రైల్వే స్టేషన్లో ఉన్న హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవస్థాన సూపరింటెండెంట్ ప్రసాద్, క్యాషియర్ నాగేశ్వర రావు లు అన్నవరం దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, స్థానిక భీమేశ్వరాలయం ఇఒ డి నాగ మల్లేశ్వరరావుల సమక్షంలో మొదటి ప్లాట్ ఫామ్పై గల హుండీని తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ. 36,767లు ఆదాయం వచ్చినట్టు భీమేశ్వర స్వామి ఆలయ ఇఒ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

టెన్త్ విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - మండపేట


విద్యార్థి వినయ్ను సత్కరిస్తున్న మల్లిబాబు

మండలంలోని తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు శ్రీమతి భూషణం జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వినయ్ ను సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వినయ్ 584 మార్కులు సాధించడం ఆనందదాయ కమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మల్లిబాబు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - మామిడికుదురు


పాశర్లపూడిలంక లో ఉపాధ్యాయులకు సన్మానం

పాశర్లపూడి లంక బొరుసు తిరుపతయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టెన్త్ ద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా హెచ్ఎం ఎన్విఎస్ఎస్.దుర్గాప్రసాద్, సహోపాధ్యాయులు కెవి.విజయ లక్ష్మిలను సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు, సానికులు మంగళవారం శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొరుసు గోపాల కష్ణ, పితాని వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పివి.రావు జయంతి

ప్రజాశక్తి-అమలాపురం


హరి మనోవికాస కేంద్రంలో కేక్కట్ చేస్తున్న దృశ్యం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం స్థానిక కొంకాపల్లి హరి మనోవికాస కేంద్రం మంగళవారం పివి.రావు జయంతిని ఆయన అభిమా నులు ఘనంగా నిర్వహిం చారు. తొలుత అంబేద్కర్ పివి.రావు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికలాంగులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో పివి.రావు సోదరుడు పోతుల నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పెయ్యల పరశురాం, జాతీయ కార్యదర్శి జల్లి శ్రీనివాస రావు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ బ్లడ్ డొనేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బూల విజయబాబు, దళిత సేన అధ్యక్షుడు డేవిడ్ అంబేద్కర్, జల్లి శేఖర్, పోతుల నాగర్జున, మాదే విజయకుమార్,పినిపే సతీష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తాళ్లపూడి


పట్టుబడ్డ బియ్యంతో పోలీసులు అధికారులు

తెలంగాణ నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తాళ్లపూడి అధికారులు మంగళవారం పట్టుకున్నారు. తాళ్లపూడి ఎస్ఐ కెవి.రమణ తెలిపిన వివరాల మేరకు తెలంగాణ నుంచి కాకినాడకు ఒక వ్యాన్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారని తాళ్లపూడి సిఎస్డిటి సునీతకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసుల సహకారంతో వాహన తనిఖీలు చేపట్టారు. బియ్యం తరలిస్తున్న వ్యాన్ను గుర్తించారు. సుమారు రూ.1.80 లక్షల విలువ చేసే ఐదు వేల కేజీల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. వి.కృష్ణంరాజు, కె.గంగాధర్లను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా సారా తయారీ, అమ్మకాల నియంత్రణకు ప్రత్యేక కార్య చరణతో ముందుకు సాగాలని జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సారా తయారీ ఉపయోగించే బెల్లం సరఫరా చేసే వారిని కట్టడి చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రవాణా అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టేలా చర్యలు తీసుకోవాల న్నారు. పోలీసులు వత్తినే పన్యాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతిలో కేసుల దర్యాప్తుని వేగంగా పూర్తి చేయాలన్నారు. కోర్టులో విచారణలో ఉన్న కేసులను పురోగతి నిశితంగా పరీక్షించే ముద్దాయిలకు శిక్ష పడేట్లుగా చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్ కుమార్ సింగ్, పి.సునీల్ కుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్ కుమార్, సబ్ అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మం సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఆలమూరు


వీర బ్రహ్మంను సత్కరిస్తున్న ఎస్టియు నాయకులు

విద్యార్థుల భవిష్యత్తు కోసం వీరబ్రహ్మం మాస్టారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్టియు శాఖ మండల శాఖ నాయకులు అన్నారు. స్థానిక బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్థిక సౌజన్యంతో నిర్వహించబడిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయన్ను ఎస్టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వాకరు మాట్లాడుతూ 25 రోజులు పాటు 120 మంది విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ ఇవ్వడమే కాకుండా సుమారు రూ.50 వేల విలువ గల మెటీరియల్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారని వివరించారు.కార్యక్రమంలో వైవి. రామచంద్రం, ఎం.రాజగోపాల్, వంశీకష్ణ, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, గోవిందరాజు, లోకేష్, రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరే క ప్రభుత్వం

ప్రజాశక్తి - అంబాజీపేట


తహశీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎఐసిసి మెంబర్ బిఆర్కె.నాయుడు మాట్లాడుతూ తడిసిన , పొడి ధాన్యాన్ని కలాల్లోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, పిసిసి మెంబెర్స్ ములపర్తి మోహనరావు,మాచవరపు శివన్నారాయణ, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు వడ్డీ నాగేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి, దేవరపల్లి రాజేంద్ర, మహ్మద్ ఇస్మాయిల్, కొల్లి సరోజని, పులిదిండి బాలయోగి, చిట్ల జోగేస్వరరావు, సిపిఐ నాయకులు పితాని ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలో పలు చోట్ల కరెంట్ కష్టాలు మొదలయ్యాయని బిసి సేన నాయకులు యాట్ల నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ తీస్తున్నారని అన్నారు. ద్రాక్షారామ లో రాత్రి 10,12 గంటలకు తెల్లవారు జామున 3,4 గంటల సమయంలో కరెంట్ తీసివేశారని అన్నారు. కరెంట్ పలు మార్లు తీసివేయడంవలనప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారన్నారు. ఇప్పటికైనా సంభందిత అధికారులు స్పందించి రాత్రి సమయంలో కరెంట్ పోకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.